క్లుప్తంగా

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

మాడుగుల రూరల్ : నీటి సంఘాలు ఎన్నికలు ఈ నెల 14వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు మండల ఇరిగేషన్ జేఈ భార్గవ్‌కుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. మండలంలో 8 మధ్య తరహా, 14 చిన్నతరహా నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు గ్రామాల్లో సంఘాలు ఓటర్ల జాబితాలు విడుదల చేశామన్నారు. మధ్య తరహా నీటి సంఘానికి సంబంధించి 12 మంది డైరెక్టర్లు, చిన్నతరహా నీటి సంఘానికి సంబంధించి ఆరుగురు డైరెక్టర్లు ఉంటారని, వీరి నుంచి ఒకరు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను మిగిలిన డైరెక్టర్లు ఎన్నికుంటారని జేఈ భార్గవ్‌కుమార్ తెలిపారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

రోలుగుంట : జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 2013-2014 బ్యాచ్ 10 వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏళ్లుగా వివిధ వృత్తుల్లో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ ఒక్క చోట కలిశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు కలియ తిరిగారు. తాము చదువుకున్నప్పటి రోజులను నెమరు వేసుకున్నారు. నాడు తమకు బోధన జరిపిన ఉపాధ్యాయులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు. సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థుల బృంద నాయకుడు లక్కరాజు గోవింద, నిట్టా రమేష్ ఈ కార్యక్రమాన్ని నడిపించారు. సహచరులంతా వారిని అభినందించారు.

జోరుగా పూడికతీత పనులు


పొక్లెయిన్‌తో కాలువలో పూడిక తొలగింపు

నర్సీపట్నం : మున్సిపాలిటీలో పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మెయిన్ డ్రైయిన్లతో పాటు వార్డుల్లోని మైనర్ డ్రైయిన్‌ల్లో పేరుకుపోయిన పూడికను ప్రత్యేక యంత్రాలతో శుభ్రం చేస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పూడికతీత పనులకు రూ.45 లక్షలు కేటాయించామన్నారు. ఈ నిధులతో పూడికతీత పనులు చేపట్టామన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా పారే విధంగా కాలువలను శుభ్రం చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా చెత్తా, చెదారం కాలువల్లో వేయకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలన్నారు.

నాగయ్యపేటలో లేగ దూడల ప్రదర్శన నేడు

దేవరాపల్లి : నాగయ్యపేట గ్రామంలో సోమవారం లేగదూడల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్టు మండల పశువైద్యాధికారి కె.మంజుషారాణి తెలిపారు. రైతులకు లేగ దూడల యాజమాన్యం పట్ల అవగాహన కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక రైతులంతా ఈ కార్యక్రమాన్ని తమ లేగదూడలను తీసుకునిరావాలని ఆమె సూచించారు. పశుపోషణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా రైతులకు సమగ్రంగా వివరిస్తామని అన్నారు.


పశువైద్యాధికారి మంజుషారాణి


వసతి గృహం ప్రహరీ ధ్వంసం కావడంతో కర్రలు కట్టిన దుస్థితి


వంట గదిలో బీటలు వారిన గోడలు


విద్యార్థులు నిద్రించే గదిలో స్లాబ్ నుంచి పెచ్చులు రాలుతున్న దృశ్యం

వసతి గృహం.. వానొస్తే భయం భయం

- శిథిలావస్థకు చేరుకున్న బీసీ బాలుర వసతి గృహం
- వర్షం వస్తే వేరే హైస్కూల్ భవనంలోకి తరలింపు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- గత ప్రభుత్వ హయాంలో రూ.1.06 కోట్లతో మరమ్మతులకు ప్రతిపాదనలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


శిథిలావస్థకు చేరుకున్న దేవరాపల్లి బీసీ బాలుర వసతి గృహం.

దేవరాపల్లి : దేవరాపల్లిలోని బీసీ బాలుర వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షానికే వసతి గృహంలోని గదులన్నీ కారిపోతున్నాయి. వసతి గృహంలో ఏడు గదులు ఉండగా చిన్నపాటి వర్షం కురిసినా ఆఫీస్ రూమ్, వంటగది, **స్టోర్ రూమ్, విద్యార్థులు ఉండే అన్ని గదులు తడిసి ముద్దవుతున్నాయి. విద్యార్థుల పుస్తకాలు, దుప్పట్లు** ఇతర సామాగ్రి తడిసి ముద్దవుతున్నాయి. దీనికి తోడు స్లాబ్ పెచ్చులు రాలిపడుతుండంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

వసతి గృహంలో నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నవారు 70 మంది ఉన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వసతి గృహ ప్రహరీ గోడ సైతం శిథిలమైంది.

వర్షం వస్తే వేరే స్కూల్‌కు విద్యార్థుల తరలింపు....

వసతి గృహం భవనం ప్రమాదకర స్థితిలో ఉండడంతో పాటు వర్షం వస్తే కారిపోతుండడంతో స్థానిక విద్యార్థులకు కంటి మీద నిద్ర లేని పరిస్థితులు నెలకొన్నాయి. వర్షం కురిస్తే చాలు ఇక్కడి విద్యార్థులను ముందస్తు జాగ్రత్తలలో భాగంగా సమీప హైస్కూల్‌కు తరలిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రూ.1.06 కోట్లతో ప్రతిపాదనలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో వసతి గృహం పునఃనిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.1.06 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే సార్వత్రిక ఎన్నికలతో దీనికి బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చి టీడీపీ కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు క్షణం క్షణం భయం భయంగా గడుపుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి



మా వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే ఏ సమయంలోనైనా విద్యార్థులందర్నీ దగ్గర్లో ఉన్న హైస్కూల్ భవనంలోకి తరలిస్తున్నారు. వర్షం వస్తే సక్రమంగా నిద్ర ఉండడం లేదు. తుపాను హెచ్చరికలు వస్తే చాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మరుగుదొడ్లు పనిచేయక పోవడంతో అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి తమ ఇబ్బందులను తొలగించాలి.

–వి.వి.రోహిత్‌కుమార్, టెన్త్ విద్యార్థి

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం..



వర్షం కురిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా సమీపంలో హైస్కూల్ భవనంలోకి తరలిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ అధికారులు ఇటీవల ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు కోసం కొలతలు తీసుకున్నారు. చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఈ.రాజేంద్రబాబు వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహం పరిస్థితిపై నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. – కె.వి.లక్ష్మీనారాయణ, బీసీ వసతి గృహ అధికారి, దేవరాపల్లి

వర్షం వస్తే హాస్టల్‌లో ఉండాలంటే భయం వేస్తుంది



వర్షం వస్తే గదులన్నీ కారిపోవడంతో పుస్తకాలు, బట్టలు, దుప్పట్లు తడిసిపోతున్నాయి. మరుగుదొడ్లన్నీ పూర్తిగా శిథిలమయ్యాయి. భవనం పై భాగం నుండి పెచ్చులు రాలి పడుతున్నాయి. ప్రభుత్వం స్పందించి మాకు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. –జి.ప్రేమ్‌కుమార్, టెన్త్ విద్యార్థి, బీసీ వసతి గృహం.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దీంతో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచిత ప్రసాదం అందించింది. అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాట్లు చేశారు.


మోదకొండమ్మ తల్లిని నగలు పూలుతో అలంకరించిన దృశ్యం


మోదకొండమ్మ ఆలయంలో పాదాలును దర్శించుకుంటున్న భక్తులు

ఎట్టకేలకు ప్రధాన రోడ్లపై గోతుల పూడ్చివేత

చోడవరం : ప్రమాదాలకు కేంద్రాలకు మారిన రోడ్లపై గోతులను ఎట్టకేలకు పూడ్చే పనిని ఆర్అండ్‌బీ శాఖ చేపట్టింది. పలు రహదారుల్లో ఉన్న గోతులను పూడుస్తుండడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై పడిన గోతులను పూడ్చక పోవడంతో వర్షాలకు అవి పెద్దపెద్ద గోతులుగా మారి అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా వెంకన్నపాలెం- సబ్బవరం బీఎన్ రోడ్డు, అనకాపల్లి వయా చోడవరం, మాడుగుల రోడ్డు, వడ్డాది వయ్యా కొత్తకోట, రావికమతం మీదుగా నర్సీపట్నం వెళ్లే రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్లలో గోతుల్లో పడి రోజూ ఎక్కడో చోట ప్రమాదం జరగడం సాధారణంగా మారింది. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేపట్టి, గోతులు పూడ్చాలని ఆర్‌అండ్‌బీ శాఖకు ఆదేశాలు జారీ కావడంతో మరమ్మతు పనులు మొదలుపెట్టారు. సబ్బవరం-వెంకన్నపాలెం రోడ్డుపై పనులు చేపట్టారు.


వెంకన్నపాలెం-సబ్బవరం బీఎన్‌రోడ్డుపై పడ్డ గోతులను తారువేసి పూడుస్తున్న సిబ్బంది

మండలంలో కూలీల కొరత


రోలుగుంట మండలంలో వరి కోతలు

రోలుగుంట : మండలంలో కూలీల కొరత ఏర్పడింది. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరి పొలాలు ఒకేసారి పండడంతో రైతులు కోతల పనుల్లో నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా ఎండలు కాయడం, వాతావరణం అనుకూలంగా ఉండడంతో మండలంలో వరి కోతలు చేపట్టారు. దీంతో కూలీలకొరత ఏర్పడి, రోలుగుంట, కొండపాలెం, కంచుగుమల తదితర గ్రామాల్లో కూలీలు దొరకక కుటుంబ సభ్యులే కోతుల పనుల్లో పాల్గొంటున్నారు. ఆదివారం మండలంలో రైతు నాయకుల సమాచారం మేరకు సుమారు 1200 ఎకరాల్లో వరికోతలు జరిగాయి.

మామిడిలో అంతర పంటగా నువ్వు సాగు

కె.కోటపాడు : అంతర పంటల సాగు విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు మామిడి పంటలో అంతర పంటగా నువ్వు పంటను సాగు చేస్తున్నారు. మొక్కదశలో ఉన్న మామిడి తోటల గల మధ్య గల ఖాళీ ప్రాంతంలో నువ్వు పంటను సాగు చేస్తున్నారు. చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, కొరువాడ, కె.కె.అగ్రహారం గ్రామాల్లో 30 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మామిడి పూతదశకు చేరుకున్న సమయంలో నువ్వు పంట కోతదశకు చేరుకుంటుందని సాగు రైతులు తెలిపారు. అంతర పంటల వల్ల సాగు లాభదాయకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


అగ్రహారంలో అంతర పంటగా సాగులో ఉన్న నువ్వు పంట

దత్తపీఠంలో సప్తాహ మహోత్సవం


వి.వి.అగ్రహారం దత్తపీఠంలో ప్రారంభమైన సప్తాహ కార్యక్రమం

మాడుగుల రూరల్ :వీరవల్లి అగ్రహారం శ్రీదత్త పీఠంలో సప్తాహ కార్యక్రమం ఆదివారం ప్రారంభం అయింది. ఈ నెల 15 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిరాంటకంగా జరుగుతుందని పీఠాధిపతి డి. శ్రీనివాస భరణిశర్మ తెలిపారు. దత్త భజన మండలి సభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముగింపు రోజు ఈ నెల 15 న ఉదయం హోమం, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం పల్లకీ సేవ జరుగుతుందన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

మాడుగుల: ఆరు ఆరుగాలం పండించిన పంటలు చేతికందే సమయంలో తుపానులకు తడిసిపోతుండడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. గత రెండు రోజుల నుంచి వరి కోతలు ప్రారంభించిన రైతులకు మరలా చుక్క ఎదురైంది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో వాతావరణం మేఘావృతం కావడంతో మరలా వరి చేలు దెబ్బ తింటాయని ఆందోళన చేందుతున్నారు. పెంగల్ తుఫాను దెబ్బకు సుమారు రెండు వేల ఎకరాల్లో కోసిన వరి చేలు తడిచి ముద్దయ్యాయి. మరలా తుపాను ప్రభావం తగ్గిందని, రెండు రోజుల నుంచి సుమారు 3 వేల ఎకరాల్లో వరికోతలు కోశారు.

యంత్రాలపై ఆధారం..

రైతులు ఒక్కసారిగా కోతలు మొదలు పెట్టడంతో కూలీలు దొరకకపోవడంతో యంత్రాలతో కోతలు నూర్పిడి చేపడుతున్నారు. యంత్రాల ద్వారా ఎకరా పొలం కోతలు, నూర్పిడితో రూ.3500 ఖర్చు అవుతుంది. కూలీలతో ఎకరా కోత నూర్పిడికి రూ.10 వేలు వరకూ ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు.


మాడుగుల మండలంలో కోసిన వరి చేలు పొలాల్లోనే ఉంచిన దృశ్యం


సత్యవరంలో యంత్రంతో కోత నూర్పిడి చేస్తున్న దృశ్యం

ఎం.అలమండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం నేడు

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభిస్తారని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారుల సమక్షంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు హాజరవుతారని ఆమె తెలిపారు.

తెనుగుపూడిలో రెవెన్యూ సదస్సు నేడు

మండలంలోని తెనుగుపూడిలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్టు స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు భూ సంబంధిత సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి: జాతీయ రహదారిపై కాగిత సమీపంలో ఆదివారం ఓ కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. విశాఖకు చెందిన ఓ కుటుంబం కారులో అన్నవరం వెళుతుండగా కారుకు ఆవు అడ్డు రావడంతో అదుపు తప్పి ఢీకొట్టింది. ఆవు కారుపై పడడంతో ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు మినహా మిగతా వారంతా క్షేమంగా ఉన్నారు.

రోజూ రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు


కె.రమాదేవి

మాడుగుల రూరల్ : భూ సమస్యలకు సంబంధించి మండలంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభం అయ్యాయని తహసీల్దారు కె.రమాదేవి ఆదివారం తెలిపారు. కాగా ఈ నెల 6వ తేదీ తర్వాత రెండు రోజులు సెలవులు అనంతరం సోమవారం నుంచి ప్రారంభం అవుతున్నాయన్నారు. రోజుకు రెండు గ్రామాల్లో ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో గ్రామంలో ఈ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 9 న చినగొర్రిగెడ్డ, తిరువాడ, 10న కె. వల్లాపురం, కింతలి, 11న రావిపాలెం, డేగలపాలె, 12 న మేడవీధి పిట్టగెడ్డ, 13న చింతలూరు, వీరనారాయణం, 16 న కె.జె.పురం, పప్పుశెట్టి శేరి, 17న మాడుగుల, సాగరం, 18 న తాటిపర్తి, శంకరం, 19న ఎల్. గవరవరం, జె.డి.పేట, 20న పోతనపూడి అగ్రహారం, భాగవతుల అగ్రహారం, 21న ముకుందపురం, వంటర్లపాలెం, 23న ఎల్.పొన్నవోలు, ఎల్.కృష్ణాపురం, 24న ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం, 26 న కూర్మనాథపురం, చినకూర్మాం, 27న గొప్పులపాలెం, ఎల్.కొత్తపల్లి, 28 అవురువాడ, కాగిత, 30 న పి.శివరామపురం, పొంగలిపాక, 31న వీజెపురం ఎం.కృష్ణాపురం, వచ్చే ఏడాది జనవరి 2న సత్యవరం, జంపెన, 3న ఎరుకువాడ లక్ష్మీపురం, వి.వి.అగ్రహారం, 4న జి.అగ్రహారం, ఎం.కోడూరు, 6న ఒమ్మలి, గాదిరాయి, 7న చినసారాడ, పెదసారాడ, 8న పెద గొర్రిగెడ్డ, అనుకూరు, సంగ్యాం, గ్రామాల్లో ఈ గ్రామ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

చీడికాడ : మండలంలోని రెండు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం చుక్కపల్లి సచివాలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు చుక్కపల్లి మధ్యాహ్నం 2 గంటల నుంచి 3గంటల వరకు సీతారామపురంకు చెందిన రైతులు ఈ సదస్సును ఉపయోగించుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలు ఉంటే సదస్సులో అర్జీలు అందించాలని కోరారు.

రోలుగుంట : కొమరవోలు గ్రామంలో వాయిదా పడిన రెవెన్యూ సదస్సు సోమవారం నిర్వహించనున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు తెలిపారు. రైతులు తమ భూ సమస్యలకు సంబంధించిన వినతులను ఈ సదస్సుల్లో అందజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

ఈరోడ్లపై ప్రయాణం నరక యాతన


మన్యపురట్ల వెళ్లే రోడ్డులో గోతులు


నర్సీపట్నం, తుని మధ్య ములగపూడి వద్ద ..

నాతవరం : మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా తయారు కావడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి తాండవ రిజర్వాయరుకు వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారు కావడంతో ఈ రూటులో ప్రయాణించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మన్యపురట్ల రాజుపేట అగ్రహారం ఉప్పరగూడెం నాయుడు పాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ అడుగువేయలేని విధంగా గోతులు ఉన్నాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే నర్సీపట్నం తుని మధ్య అర్‌అండ్‌బీ రోడ్డు ములగపూడి గాంధీనగరం ఎ.శరభవరం గన్నవరం మెట్ట వద్ద మన్యపురట్ల జంక్షన్ వద్ద ప్రమాదాలు తలపించేలా రోడ్డు దెబ్బతింది, మన్యపురట్ల జంక్షన్ వద్ద తరుచు ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు శ్రమదానంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు పూడ్చారు. ఇటీవల ములగపూడి వద్ద పంట పొలాలకు ప్రవహించే తాండవ కాలువ నీరు రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డంతా కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కళ్ల ముందే ఆర్‌అండ్‌బీ రోడ్లన్నీ శిథిలం అవుతున్నా పట్టించుకునే నాథులు లేరని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చినగొలుగొండపేట గునుపూడి మధ్యలో అర్‌అండ్‌బీ రోడ్డుపై కల్వర్టు శిథిలమై రోడ్డు మధ్యలో రంధ్రం ఏర్పడింది. ఈ కారణంగా ద్విచక్ర వాహనాలు తప్ప పెద్ద వాహనాలు రాకపోకలు సాగించడం లేదు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన రోడ్లు బాగు చేయించాలని కోరుతున్నారు.

మామిడి తోటలకు స్వచ్ఛంద బీమా అమలు


కిరణ్మయి

కె.కోటపాడు : మామిడితోటలకు సంబంధించి 2024-25 కాలానికి స్వచ్ఛంద బీమా పథకం అమలులో ఉన్నట్టు ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. బీమాలో ఉన్న మామిడి తోటలకు వాతావరణ ఆధారితం అనగా అకాల వర్షాలు, వాతావరణంలో తేమ శాతం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటకు నష్టం కలిగినట్టు గుర్తిస్తే సంబంధిత రైతులకు బీమా నగదు అందుతుందని తెలిపారు. ఈ బీమాలో చేరేందుకు ఎకరానికి రైతులు రూ.2200 అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ పేరిట చెల్లించాలన్నారు. తోటలకు నష్టం కలిగే పరిస్థితుల్లో బీమా కింద ఎకరానికి రూ.44వేల నగదును అందుతుందని తెలిపారు. ఆధార్‌కార్డు, భూమి పత్రాలు, పంట సాగు ధ్రువీకరణపత్రం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఫోన్ నంబర్లతో నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో మామిడి పంటకు బీమా పథకంలో చేరవచ్చునని ఆమె తెలిపారు. సాగు రైతులు ఈ నెల లోగా చేరాలని ఆమె సూచించారు.

23 ఏళ్ల తరువాత కలిశారు..

దేవరాపల్లి: మండలంలో తెనుగుపూడి బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ గురుకుల పాఠశాలలో 2000-2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 23 సంవత్సరాలు తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారు వివిధ వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపావతి, పాల్గొన్నారు.


తెనుగుపూడి గురుకుల పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మోదమాంబ పాదాలు గోపురం నిర్మాణానికి విరాళం

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి సంబంధించి అమ్మవారి పాదాలు, గోపురం నిర్మాణానికి స్థానికులు గొల్లవిల్లి అప్పారావు, సత్యవతి దంపతులు, వారి కుమారుడు చిరంజీవి, మీనాక్షి దంపతులు రూ.10వేల విరాళం ఆదివారం అందజేశారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు ఆదివారం ఈ విరాళం అందజేశారు. అమ్మవారి పాదాలును వడ్డాది- పాడేరు ప్రధాన రహదారి పక్కన్న నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశాస్త్రి, స్థానికులు పడాల అప్పలనాయుడు, అప్పల నర్సయ్య తదితర్లు పాల్గొన్నారు.


సర్పంచ్ సంజీవిరావుకు విరాళం అందజేస్తున్న దాతలు